క్లుప్తంగా

ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి

వరికుంటపాడు: వరికుంటపాడు సొసైటీ పరిధిలో సభ్యత్వం కలిగిన రైతులు కార్యాలయంలో సంప్రదించి తమ ఆధార్‌కార్డును అనుసంధానం చేయించుకోవాలని సొసైటీ సీఈఓ ఎం.రత్తయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,905 మందికి గానూ 1,103 మంది ఆధార్ అనుసంధానంతో ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు స్పందించాలని కోరారు.

30న ప్రసన్నుని భూములకు కౌలు వేలం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన మెట్ట, మాగాణి భూములకు ఈనెల 30వ తేదీన కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి రాధాకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాలపాటు కౌలుకు ఇచ్చేలా వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు వివరాలకు దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వాటర్ డిస్పెన్సర్ వితరణ



దాతను సన్మానించిన దృశ్యం

కావలి: మండలంలోని చలంచర్ల పంచాయతీ పరిధిలో పెద్దవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు విశాఖపట్నంకు చెందిన వ్యాపారవేత్త ఇరువూరి మాల్యాద్రి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మంగళవారం వాటర్ డిస్పెన్సర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, విద్యా కమిటీ చైర్మన్ మహేంద్ర, సభ్యులు, హెచ్‌ఎం మధుసూదన్‌రావు, టీచర్ ఏడుకొండలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కావలి: రూరల్ మండలంలోని రుద్రకోట గ్రామంలోని వడ్డిపాళెంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ

అల్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ శీనానాయక్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. మండలంలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను ఆదేశించారు.

3 నుంచి సిద్ధేశ్వరంలో దసరా మహోత్సవాలు

సీతారామపురం: సిద్ధేశ్వరంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇష్టకామేశ్వరీదేవి ఆలయ కమిటీ సభ్యులు, కాశీనాయక భక్తబృంద సభ్యులు మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 3న సిద్ధేశ్వరి అలంకారం, 4న బాలా త్రిపుర సుందరి, 5న వేద మాత గాయత్రి, 6న లలితా త్రిపుర సుందరి, 7న అన్నపూర్ణ, 8న మహాలక్ష్మి, 9న మహా సరస్వతి, 10న మహాదుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజరాజేశ్వరి అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని తెలియజేశారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

సోమశిల: ఇసుక అక్రమ రవాణాపై నిఘాపై నిఘా పెట్టామని ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. అనంతసాగరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్నానది నది నుంచి ఇసుక అక్రమ రవాణా సమాచారం తెలిస్తే ఇవ్వాలని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి, ఏఎస్సై మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరమనలో పౌష్టికాహార మాసోత్సవాలు

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు సీడీపీఓ సునీలత హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

27 జాబ్‌మేళా

ఉదయగిరి: ఏపీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94908 97509 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

ఇసుక తవ్వేసి.. అమ్మేసి..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆత్మకూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నేతలు రెచ్చిపోతున్నారు. ఏకంగా అనధికారికంగా రీచ్‌లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు తెలిసినా ఒత్తిళ్ల కారణంగా ఏమీ చేయలేకపోతున్నారు.

- నియోజకవర్గంలో యథేచ్ఛగా అక్రమ రవాణా
- ఇందుకోసం 17 అనధికార రీచ్‌లు
- కూటమి నాయకుల నిర్వాకం
- తాజాగా నాలుగు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం





ఆత్మకూరు పోలీసు అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఆత్మకూరు: అధికారం అండతో నియోజకవర్గంలో కూటమి నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. ఇసుక అక్రమ రవాణా కోసం తాత్కాలికంగా రీచ్‌లు ఏర్పాటు చేశారంటే వారి దోపిడీ ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఆయా మండలాల పరిధిలో పెన్నానది, బొగ్గేరు, కావేరి వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేసేందుకు 17 రీచ్‌లను ఏర్పాటు చేశారని ఆరోపణలున్నాయి. ఆయా గ్రామాల్లో రాత్రి వేళల్లో ఇసుక ట్రాక్టర్ల వేగాన్ని చూసి గ్రామస్తులు భయాందోళనకు గురై మైనింగ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తున్న సందర్భాలున్నాయి. అయితే వారు ఈ సమయంలో రాలేమని, వాహనం అందుబాటులో లేదని, తమ పరిధిలోకి రాదని సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడంటే..

- ఆత్మకూరు మండలంలోని ఆరవేడు గ్రామ సమీపంలోని కావేరి వాగులో, దేపూరు, నాగులపాడు, బోయలచిరివెళ్ల, అశ్వనీపురం, గండ్లవేడు గ్రామాల పరిధిలోని బొగ్గేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు రీచ్‌లు ఏర్పాటు చేశారు. ఒకచోట నిఘా పెట్టి పట్టుకుంటే మరుసటి రోజు బొగ్గేరు ప్రాంతంలోనే మరోచోట రీచ్ వెలుస్తోంది. రాత్రి వేళల్లో ఇసుకను యథేచ్ఛగా అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.
- అప్పారావుపాళెం ఎగువ, బండారుపల్లి, వాశిలి
- వీర్లగుడిపాడు మధ్య డొంక రోడ్డులో పెన్నా ఇసుకను తరలించేందుకు అనుకూలంగా రీచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రాంతాల నుంచి పట్టణంలోకి అక్రమంగా తరలిస్తున్నారు.
- అనంతసాగరం మండలంలో శంకరనగరం, కొత్తపల్లి, రేవూరు, పీకేపాడు ప్రాంతాల నుంచి పెన్నానది ఇసుకను తరలించేందుకు రీచ్‌లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తున్నారు.
- చేజర్ల మండలంలో మడపల్లి, తూర్పుకంభంపాడు, కోటితీర్థం గ్రామాల పరిధిలో రీచ్‌లను ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకుని పెన్నానది ఇసుకను తరలించి ఆ గ్రామాల శివార్లలో డంప్ చేసి దూర ప్రాంతాలకు టిప్పర్లలో రవాణా చేస్తున్నారు.
- సంగం మండలంలో అన్నారెడ్డిపాళెం, దువ్వూరు గ్రామాల నుంచి పెన్నానది ఇసుకను తరలించేస్తున్నారు.

తరలిస్తుండగా..

మంగళవారం తెల్లవారుజామున ఆత్మకూరు సీఐ జి.గంగాధర్, ఎస్సై షేక్ జిలానీలు దాడులు చేసి నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెంలో పెన్నానది నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. అలాగే నల్లగొండ్ల మార్గం నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న మరో రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

కఠినంగా వ్యవహరిస్తాం

ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించం. సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తున్నాం. గత వారంలో మూడు ట్రాక్టర్లు, మంగళవారం నాలుగు ట్రాక్టర్లు పట్టుకుని కేసులు నమోదు చేశాం. మరింత నిఘా పెంచి అక్రమ రవాణాను అరికడతాం.

– షేక్ జిలానీ, ఎస్సై, ఆత్మకూరు

వరద బాధితులకు నగదు సాయం



ఉదయగిరి: విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక హోలీ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం రూ.1.10 లక్షల విరాళం సేకరించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డికి ఆ నగదును ప్రిన్సిపల్ సుధాకర్ అందజేశారు. హెచ్‌ఎం కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాల పరిశీలన

వరికుంటపాడు: మండలంలో విరువూరు గ్రామ సచివాలయ పరిధిలోని నార్త్ కొండాయపాళెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను మంగళవారం ఎంపీడీఓ ఎస్.మల్లికార్జున పరిశీలించారు. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు పక్కాగృహాలు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాయో గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

వ్యాధులపై అవగాహన

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సెక్టార్ సమావేశం జరిగింది. గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఆయనపై అంత ప్రేమెందుకో..!

- అటవీ శాఖలో అడ్డగోలు పోస్టింగ్
- ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు



ఉదయగిరి రేంజ్ కార్యాలయం

ఉదయగిరి: అటవీ శాఖలో జరిగిన బదిలీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయగిరి రేంజ్ పరిధిలో కొందరి విషయంలో ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. దుత్తలూరు డిప్యూటీ రేంజ్ అధికారిగా పనిచేస్తున్న టి.శ్రీనివాసులు రెండురోజుల క్రితం అనంతసాగరానికి బదిలీ అయ్యారు. ఉదయగిరి రేంజ్ పరిధిలో కృష్ణంపల్లి సెక్షన్ ఆఫీసర్‌గా వై.శ్రీరాములును నియమించారు. పశ్చిమ ప్రాంతంలో బి.వెంకటేశ్వర్లు ఇప్పటికే ఉన్నారు. స్పెషల్ సెక్షన్‌లో చిన్న వెంకటయ్య విధులు నిర్వహిస్తున్నారు. దేవమ్మ చెరువు సెక్షన్ పోస్టు ఖాళీగా ఉంది. సీతారామపురంలో ప్రస్తుతం ప్రసాద్ అనే డిప్యూటీ రేంజ్ అధికారి విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు వీరిలో ఎవరో ఒకరికి దుత్తలూరు డిప్యూటీ రేంజ్ అధికారి అదనపు బాధ్యతలు అప్పగించాలి. అలా కాకుండా ఆత్మకూరు రేంజ్ పరిధిలో మర్రిపాడు సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న కె.రవీంద్రబాబుకు ఎఫ్‌ఎసీ బాధ్యతలు అప్పగించడం వివాదాస్పదంగా మారింది. దుత్తలూరు డీఆర్వో పరిధిలో అక్రమ సంపాదనకు మంచి అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో ఈ బదిలీపై విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారి పక్క రేంజ్‌లో ఉన్న వ్యక్తికి నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతలు అప్పగించడంపై ఆ శాఖలోనే విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో డబ్బులు చేతులు మారినట్లు చర్చ జరుగుతోంది.

కలెక్టర్ రాక నేడు

సీతారామపురం: మండలంలో బుధవారం కలెక్టర్ ఆనంద్ పర్యటించనున్నట్లు తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు జాతీయ రహదారుల పనులతోపాటు పలు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని తెలియజేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఉదయగిరి: ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో ఉన్న ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ ఎస్.వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమైన దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో కమిటీలు, వాచ్‌మెన్లను నియమించుకోవాలన్నారు.

- దుత్తలూరు: మండలంలోని అన్ని ధార్మిక సంస్థలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై పి.ఆదిలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కాపలాదారులను పెట్టుకోవాలని సూచించారు.

సాంస్కృతిక పోటీలు



కావలి: పట్టణంలోని డాక్టర్ డీఆర్ విశ్వోదయ బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీలు డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో జవహర్ భారతి ఎంఎం హాల్లో మంగళవారం జరిగాయి. ఏకపాత్రాభినయం, గ్రూపు డ్యాన్స్‌లు తదితరాలు నిర్వహించారు. అనేకమంది ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమాలను విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ పర్యవేక్షించారు. న్యాయనిర్ణేతలుగా టి.పోతురాజు, డాక్టర్ జె.కృష్ణప్రసాద్, డాక్టర్ వెంకట్రావు, పి.నారాయణ, శిరీష, నల్లూరు రామకృష్ణ, లక్ష్మీ ప్రశాంతి వ్యవహరించారు.

కారు బోల్తా

- మానవత్వం చాటుకున్న సీఐ, ఎస్సై

వరికుంటపాడు: సింగిల్ విండో మాజీ చైర్మన్ కామేపల్లి వెంకటరత్నం కారులో పామూరు నుంచి జగదేవికి మంగళవారం సాయంత్రం వెళ్తుండగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ప్రమాదం జరిగింది. రోడ్డుకు అడ్డంగా గేదెలు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కారు బోల్తా పడింది. వాహనం దెబ్బతింది. అదే సమయంలో తిమ్మారెడ్డిపల్లి నుంచి ఉదయగిరికి వెళ్తున్న ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, వరికుంటపాడు ఎస్సై రఘునాథ్ కారులో ఇరుక్కుపోయిన వెంకటరత్నంను బయటకు తీసి తమ వాహనంలో పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



మర్రిపాడు : సజ్జ పంటను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అలాగే రైతు సేవా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానించిన టీచర్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు మెయిన్ పాఠశాలలో పనిచేస్తున్న బండారు వెంకటేశ్వర్లు ఈనెల 5న కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ కొల్లు చలపతి, ప్రధానోపాధ్యాయులు అంకయ్య, ఇస్మాయిల్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, టీచర్లు రమేష్, వెంకటేశ్వర్లు, రవీంద్రకుమార్, రేవతి, కబిహా, రఫీ, రసూల్, దయాకర్ పాల్గొన్నారు.

- కావలి: పట్టణంలోని పాత ఊరులో ఉన్న మున్సిపల్ హైస్కూల్లో మ్యాథ్స్ టీచర్‌గా, ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న షేక్ మస్తాన్‌వలీ జిల్లా ఉత్తమ టీచర్ అవార్డు తీసుకోవడంతో మంగళవారం సన్మానించారు. హెచ్‌ఎం సుబ్బారావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, సభ్యుడు శ్యామ్‌బాబు, టీచర్లు మధుసూదన్, దయాలత, కృష్ణవేణి, రోశయ్య, శిరీష, సుజాత, సరళ కుమారి, ప్రసూన, సునందిని, రాజేశ్వరి, మనోహర్, రమేష్, లక్ష్మీప్రసూన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు



కావలిలో..



దుత్తలూరు మండలంలో..

కావలి: పట్టణంలో బాణసంచా తయారీ కేంద్రాలు, అమ్మకాలు చేసే ప్రదేశాలను కావలి డీఎస్పీ పి.శ్రీధర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎండీ ఫిరోజ్, సిబ్బంది ఉన్నారు.

- దుత్తలూరు: అనుమతి లేకుండా ఎవరైనా బాణసంచా నిల్వలు కలిగి ఉంటే సమాచారం ఇవ్వాలని ఎస్సై పి.ఆదిలక్ష్మి తెలిపారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని వెంకటంపేటలో ఉన్న బాషా మొహిద్దీన్ బాణసంచా కర్మాగారాన్ని ఆమె తనిఖీ చేశారు. లైసెన్స్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదాములు, షాపులు, తయారీ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలన్నారు.
- ఉదయగిరి: దీపావళి పండగ సందర్భంగా అనుమతి తీసుకుని బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎస్సై ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రెండు బాణసంచా గోదాములను, తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు.
- వరికుంటపాడు: మండల కేంద్రంలోని బాణసంచా దుకాణాలను మంగళవారం ఎస్సై రఘునాథ్ తనిఖీ చేశారు. అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
- జలదంకి: మండలంలోని జమ్మలపాళెంలో ఉన్న బాణసంచా గోదామును మంగళవారం కలిగిరి సర్కిల్ సీఐ వెంకటనారాయణ తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఎస్సై హరిబాబు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సురేష్

జలదంకి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని రామవరప్పాడు పంచాయతీలో పొలం పిలుస్తోంది, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో త్వరలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. పంచాయతీ స్థాయిలో ప్రజా దర్బార్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ శివన్నారాయణ, కలిగిరి ఏడీఏ రామిరెడ్డి, ఏఓ శైలజ, వివిధ పార్టీల నాయకులు వడ్డే శ్రీనాథ్‌డ్డి, నిమ్మలపల్లి రామచైతన్య, పులుగుంట మధురెడ్డి, సర్పంచ్ ఉన్నం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పలు కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. 4వ వార్డు పరిధిలో షేక్ ఖాదర్‌బాషా, 8వ వార్డు పరిధిలో శీలా సుభద్రాదేవి, 18వ వార్డు గిరిజనకాలనీలోని చెలంచర్ల వెంకటయ్య, మల్లే చిన్నమ్మలు వివిధ కారాణాలతో మృతిచెందారు. మంగళవారం ట్రస్ట్ నిర్వాహకులు బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.10 వేల చొప్పున నగదు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, పి.వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, శాంతమ్మ, వాణీభార్గవి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను పరిశీలించిన సీఐ



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

సంగం: సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆకతాయిలు బరితెగించి బడిలో సామగ్రి ధ్వంసం చేయగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్యతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు తమ వంతుగా 30 శాతం నిధులను ఇస్తామని, గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. అనంతరం చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికలు



వాలీబాల్ ఆడుతూ..



ఆత్మకూరులో కబడ్డీ పోటీలు

వింజమూరు(ఉదయగిరి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు జరిగాయి. అండర్ – 14, – 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, చెస్‌లో ప్రతిభ చూపిన బాలబాలికలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. జెడ్పీహెచ్‌ఎస్, గురుకుల, మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యాలయాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. బుధవారం కబడ్డీ, యోగా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిదర్లదిన్నె మాలకొండయ్య, న్యాయనిర్ణేతలు ఎస్.ప్రభాకర్ రెడ్డి, వెలుగోటి కృష్ణ, తిరుపాల్‌రెడ్డి, అంజయ్య, రోసిరెడ్డి జమీర్‌బాషా, రమేష్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనుబాబు, మాచర్ల, సుమలత తదితరులు పాల్గొన్నారు.

- ఆత్మకూరు: నియోజకవర్గ స్థాయి అండర్ – 14, 17 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉత్సాహంగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, యోగా, వాలీబాల్, త్రోబాల్ తదితర క్రీడల్లో బాలబాలికలకు నిర్వహిస్తున్న పోటీలను కన్వీనర్ తిరుపతయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్ పర్యవేక్షించారు. హెచ్‌ఎం అనంతలక్ష్మి ఏర్పాట్ల గురించి ఆరా తీశారు.

జ్ఞానపీఠంలో ప్రత్యేక పూజలు



యాగం నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: మండల కేంద్రమైన సంగంలోని తిరుమన కొండపై వెలసిన రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠాన్ని తమిళనాడు వారాహి శక్తిపీఠానికి చెందిన యాగరుషి వారాహి స్వామి మంగళవారం దర్శించుకున్నారు. జ్ఞానపీఠం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు, యాగం నిర్వహించారు.

విద్యార్థులు సమాజ సేవ చేయాలి



అల్లూరులో ర్యాలీ

చేజర్ల: విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవపై దృష్టి పెట్టాలని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీరెడ్డి అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పి.యల్లయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

- అల్లూరు: జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్‌ఎస్ యూనిట్‌కు చెందిన వారు బస్టాండ్ సెంటర్‌లోని చెత్తను శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ ఎ.హరిప్రసాద్, సిబ్బంది సుధీర్ సింగ్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.
- ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్లు గోపీకృష్ణ, కిషన్‌తేజ, శోభ, మాధవి, రాజేశ్వరి, అశోక్, సూర్య తదితరులు పాల్గొన్నారు.